క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని చిన్నచిగుళ్లరేవుకు చెందిన శివయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణ సాయాన్ని శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మృతుడి భార్య వరలక్ష్మికి అధికారులు అందజేశారు. మిగిలిన మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కర్, నాయకులు మేదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీనివాసులు, నారాయణస్వామి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీఓ ఎస్ రాఘవేంద్ర పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మధు నాయక్, ఆర్ఐ అశోక్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది రవి, పతి పాల్గొన్నారు.

సజావుగా వేలం

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఏడాది పాటు టెంకాయలు, పూజా సామాగ్రి విక్రయించుకునే హక్కుల కోసం శనివారం వేలంపాట నిర్వహించారు. యర్రదొడ్డికి చెందిన రామచంద్ర అనే వ్యక్తి రూ.7,23,000లకు వేలంపాటను దక్కించుకున్నారు.

నేడు వడ్డెర్ల ఆత్మీయ సమావేశం

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని సాయిఆరామంలో ఆదివారం వడ్డెర్ల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకుడు డాక్టర్ తిరుపతేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వడ్డెర్ల స్థితిగతులు, అభివృద్ధిపై అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

సిమెంట్ బస్తాల పంపిణీ

నల్లమాడ: మండలంలోని మసకవంకపల్లిలో సర్పంచ్ ఎస్.అరుణమ్మ, మాజీ సర్పంచ్ ఎస్. రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం 40 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంట్ బస్తాలు పంపిణీ చేశారు.

ఆక్రమణల తొలగింపు

కదిరి టౌన్: మార్చి నెల 2వ తేదీ నుంచి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండటంతో ఆక్రమణల తొలగింపునకు శనివారం అధికారులు చర్యలు తీసుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ దుకాణాలను ఎలా తొలగిస్తారని అడ్డుకున్నారు. ఆలయ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. టీడీపీ కౌన్సిలర్ శిరిష షాపు ముందు ఉన్న రేకులను ఆలయ అధికారులు తొలగిస్తుంటే అడ్డుకున్నారు. తొలుత ఆలయం ముందు ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని డిమాండ్ చేశారు. అద్దుగా వాటిన్నంటినీ తొలగిస్తామని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. అనంతరం ఆలయం ముందు ఉన్న దుకాణాలను తొలగించారు.

విద్యార్థినులకు అభినందన



మెరిట్ సర్టిఫికెట్లు అందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: భోపాల్‌లో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ ర్యాంకింగ్ జూడో టోర్నమెంట్‌లో 6వ ర్యాంకు సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం మేరిప రకుమారి అభినందించారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం కరాటేలో రాణించిన ఉషారాణి, బేబి, అర్చన, కావ్యాంజలి, హేమలత, సంధ్యా, శృతి, సాయిప్రియకు మెరిట్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు బందారు ఆదినారాయణ, సభ్యులు బీమిశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

ఎన్పీకుంట: చిన్న పిల్లలు, గర్భిణులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీపీఎంఓ (డివిజనల్ పారా మెడికల్ ఆఫీసర్) రెడ్డికుమార్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పావన్నగారిపల్లి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శాంతమ్మ, గురుదేవి, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, ఆరోగ్య కార్యకర్త రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని మొటుకుపల్లి సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ సుధామణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

• ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



ముత్యాలచెరువులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి పనులను ఒకటికి రెండు సార్లు ఓటర్లకు వివరించాలని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎగువపల్లి, బ్రాహ్మణపల్లి, ముత్యాలచెరువు, కేఎన్‌పాళెం గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థిగా రామచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ ఎంపిక చేసిందన్నారు. తొలి ప్రాధాన్యత ఓటును మన పార్టీ బలపరచిన అభ్యర్థికే వేసేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ఓటర్లను గుర్తించడంలో ఎదుటి వారికంటే ముందు ఉండాలని చెప్పారు. సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 13, 14, 15 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీసీఎస్ఆర్ఐ విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని, వీరిద్దరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసేలా చూడాలన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

కదిరి అర్బన్: రాజధాని విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఈనాడు పత్రికలో ప్రచురితమైన అసత్య కథనాలను వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ఖండించారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఈనాడు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనాడు పత్రిక అసత్య ప్రచారాలను మానుకోవాలన్నారు. ఇప్పటికే మీ పత్రికను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇలాగే అసత్య ప్రచారాలు ప్రచురిస్తూ పోతే రాబోవు రోజుల్లో ప్రజలే స్వచ్ఛందంగా మీ పత్రికను బహిష్కరిస్తారని హెచ్చరించారు. ప్రజలకు మేలు జరగడం ఈనాడు పత్రికకు నచ్చదని, అందుకే విషపురాతలు రాసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు అసిఫ్, గణేష్, గురుబాషా, శ్రీకాంత్, పవన్, నరసింహనాయుడు, ఫయాజ్, మనోజ్, ముబారక్, నాగేంద్ర, రాము, హరి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: సామాలగొంది పంచాయతీ రెడ్డివారిపల్లి నుంచి బండమీదపల్లి వరకూ రూ.10 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం, ఎంపీపీ నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులకు శనివారం ఎంపీపీ తాతం జగన్మోహన్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డిని గ్రామస్తులు కోరారన్నారు. ఇచ్చిన హామీ మేరకు రెడ్డివారిపల్లి నుంచి బండమీదపల్లి వరకూ 350 మీటర్ల సీసీ రోడ్డును ఎమ్మెల్యే మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు వైపీ శంకర్‌నాయుడు, గ్రామ కన్వీనర్ హరి, డైరెక్టర్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించాలి



సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నివేదిత

నల్లమాడ: చిన్న పిల్లల్లో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని శ్రీ సత్యసాయి జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నివేదిత సూచించారు. శనివారం మండలంలోని నల్లసింగయ్యగారిపల్లిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గర్భవతులు, చిన్న పిల్లలకు అందిస్తున్న టీకాలపై ఆరా తీశారు. రక్తహీనత నివారణకు గర్భిణులు, చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నల్లమాడలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో అనీమియాపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక కస్తూరిబా పాఠశాలను సందర్శించారు. పిల్లల కోసం వండిన అన్నం, కూరలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అంటూ విద్యార్థినుల అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామాంజులు, సూపర్‌వైజర్ మంజుల, ఆరోగ్య సిబ్బంది శేఖర్‌రెడ్డి, శిరీష, భారతి, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఎస్ఓ శోభారాణి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధితుడు కొత్తపల్లి నారాయణ స్వామి తెలిపిన మేరకు.. చేనేత, వ్యవసాయ వృత్తిపై జీవనం సాగిస్తున్న నారాయణస్వామి శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఆసమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి ఇల్లు కాలిపోయింది. ఇంట్లో ఉన్న మగ్గం, బియ్యం, టీవీ, వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు గమనించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

సర్వసభ్య సమావేశం రేపు

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నసీమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో నెలకున్న సమస్యలు, చేసిన పనులపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి

అమడగూరు: మండలంలోని చౌడేశ్వరీ కల్యాణ మండపంలో దుద్దుకుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి చేతులమీదుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించగా పీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బొగ్గు సురేష్ ఆధ్వర్యంలో 1,042 మందికి వైద్య చికిత్సలు చేశారు. కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లు, ఉచిత కంటి అద్దాల పంపిణీ, చెవి, ముక్కు పరీక్షలు, జనరల్ వైద్య చికిత్సలు, ఎముకల వైద్య పరీక్షలు నిర్వహించి అన్ని రకాల మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 170 మందికి కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరాన్ని ఆదివారం కూడా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, మాజీ కన్వీనర్ శేషారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బొట్టుస్వామి, సర్పంచులు షబ్బీర్, సురేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, ఆదినారాయణ, ఎంపీటీసీ పెద్దప్పయ్య, నాయకులు శివశంకర్‌రెడ్డి, చిన్నప్ప, నాగరాజు, సురేంద్రరెడ్డి, రంగారెడ్డి, వెంకటరెడ్డి, ఖాజాపీర్, శంకరప్ప, ప్రకాష్‌రెడ్డి, నారాయణ, శ్రీరాములు, నరసింహులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సక్రమంగా అందించాలి




మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి

కనగానపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని శ్రీ సత్యసాయి జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) ఎస్వీ కృష్ణారెడ్డి ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని మామిళ్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, గర్భిణులు, చిన్నారులకు టీకాలు సక్రమంగా వేస్తున్నారా? లేదా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తర్వాతా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు తనిఖీ చేసి, ఆరోగ్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? లేదా పరిశీలించారు. గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సక్రమంగా అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు చెన్నారెడ్డి, భానురేఖ, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

రామగిరి: రామగిరి, పేరూరులోని పీహెచ్‌సీలను జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపిల్లల టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు.

చక్కటి ప్రణాళికతో విజయం సాధ్యం



మాట్లాడుతున్న ఐఆర్ఎస్ అధికారి లోకనాథ్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుకు చక్కటి ప్రణాళికలతో ముందుకు సాగితే తప్పకుండా విజయం సాధిస్తారని ఐఆర్ఎస్ అధికారి బి.లోకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంస్కృతీ విద్యాసంస్థల ఆడిటోరియంలో యూపీపీఎస్సీ, ఏపీపీఎస్సీ, వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్ఎస్ అధికారి బి.లోకనాథ్ రెడ్డి , జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్ మాట్లాడారు. కెరీర్‌ను అద్భుతంగా మలుచుకోవాలంటే తప్పనిసరిగా అందుకు తగినట్లుగా ప్రణాళిక ఉండాలన్నారు. విషయపరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు ఉంటే చక్కటి ఫలితాలు సాధించొచ్చన్నారు. అనంతరం కెరీర్ గైడెన్స్ నిపుణుడు శివనాథ్ పోటీ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ కస్టమ్స్ విజయ్ మోహన్, అప్రైజర్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ మహిధర్ రెడ్డి, కళాశాల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విద్యా సంస్థల అకడమిక్ డీన్ డాక్టర్ బాలకోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అక్రమంగా పునాదులు వేస్తే చర్యలు

కొత్తచెరువు: కొత్తచెరువులోని ధర్మవరం రహదారిలో ఉన్న జగనన్న లే అవుట్లలో ఇటీవల కొందరు పట్టాలు లేకున్నా అక్రమంగా పునాదులు వేస్తున్నారు. ఈ విషయం తహసీల్దార్ రామాంజనేయులు రెడ్డి దృష్టికి వెళ్లడంతో శనివారం ధర్మవరం రహదారిలోని లేఅవుట్లను పరిశీలించారు. అక్రమంగా వేసిన పునాదులను జేసీబీతో తొలగించారు. ఈ కాలనీల్లో ప్రభుత్వం అర్హులైన వారికి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో కొందరు అక్రమంగా పునాదులు వేసుకోవడంతో చట్టరీత్యా నేరమన్నారు. వీటిని పరిగణలోకి తీసుకుని తొలగించడం జరిగిందన్నారు. ఎవరైనా పట్టాలు లేకుండా అక్రమంగా పునాదులు వేస్తే భవిష్యత్తులో అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి: లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని బుక్కపట్నం ఎస్ఐ నరసింహుడు సూచించారు. శనివారం స్థానిక సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య అధ్యక్షతన లైంగిక వేధింపులు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అసభ్యకర వీడియోలు, వాట్సాప్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు.

కొత్తచెరువు: యువత మంచి మార్గంలో నడవాలని ఎస్ఐ లింగన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక కస్తూరి బా పాఠశాల శనివారం ఎస్ఐ వలీబాషా ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు చదువుపై మాత్రమే దృష్టి సారించాలన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు సముచిత స్థానం

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు రాజకీయ పదవుల్లో సముచిత స్థానం లభిస్తోందని వాల్మీకి సంఘం మండల నాయకులు అన్నారు. శనివారం కనగానపల్లిలో వాల్మీకి సంఘం నాయకులు డైరెక్టర్ ప్రభాకర్, లాయర్ నల్లప్ప, అంకే అశోక్, గోపాల్ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున 11 స్థానాలను బీసీలకు కేటాయించటంపై హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి కులానికి చెందిన సానేపల్లి మంగమ్మను ఏకగ్రీవంగా ఎన్నిక చేయటానికి కృషి చేసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.